# లలిత వివాహం

వేకుమళ్ళ కామేశ్వర రావు

(12 నిమిషాల కథ)

లలిత తండ్రియైన సూర్యారావు లలితకి ఎనిమిదేళ్ళప్పటినుంచీ వివాహంకోసం ప్రయత్నం చేస్తున్నాడు ఎన్ని సంబంధాలు వచ్చినా కొంపదగ్గిరికి వచ్చేటప్పటికి పుటుక్కుమని తేలిపోతున్నాయి లలితని పెళ్ళివారికి చూపించడం పెద్ద ప్రయత్నం అసలు పెళ్ళివారు ఇంటికివచ్చేరన్న ఛాయ తెలియగానే ఆ అమ్మాయి ఏగాది పక్కనో, ఏ మంచంకిందో, ఏ అటకమీదో, లేక ఏ పొరుగింట్లోనో ఏ అరటిచెట్ల మధ్యో, ఏ చెట్టుమీదో దాక్కుంటుంది ఎలాగైతేనేమి వెతికి పట్టుకొచ్చి పెళ్ళివారికి కనబరచబోయేటప్పటికి రాగాలు రాగాలు, ఒకటేరాగాలు ఇలాంటి పిల్లని చూశాటప్పటికి పెళ్ళివారికి అక్కడే మొహంమొత్తిపోయేది అయినా అప్పటికి పైకేమీ కనబడనీక లోలోపల నిశ్చయించుకొనేవారు మనకెందుకీ గొడవ అని ఈ మోస్తరుగా బోలెడన్నిసంబంధాలు తప్పిపోయేయి ఆమెని తిట్టినా,కొట్టినా, తిండిపెట్టకపోయినాఅదేవరస కోపంవచ్చి సూర్యారావు ఒకరోజున ఆపిల్లకి అన్నం పెట్టకుండా గదిలోపెట్టి తాళం వేశాడు. గదిలోమాత్రం పెళ్ళికూతురులా కూచుంది ఈతంతుగా పదకొండో ఏటివరకు నడిచింది

ఎలాగైతేయేం ,ఒక సంబంధం కుదిరింది వాళ్ళది కాకినాడ, తల్లి, కొడుకు, కూతురు—కూతురు అత్తగారింటికి వెళ్ళిపోయింది—ఆస్తిపరులు, తండ్రిలేడు వైశాఖ మాసంలో ముహూర్తం ఏర్పాటుకాగా పెళ్ళికి బంధుమిత్ర సమేతంగా పెళ్ళివారు తర్లివచ్చారు పెళ్ళిలో మొగపెళ్ళివారు ఏరకం ముచ్చట్లకీ నోచుకోలేదు. ఆ అయిదు రోజులూ లలిత మూగినోము పట్టేసింది పోనీ అదే పోయింది, పెద్దమనిష యేక మహా చక్కగా దారిలోకి వస్తుంది, తొందరేమొచ్చింది అని మొగ పెళ్ళివారనుకున్నారు పెళ్ళికొడుకైన రాజేశ్వరరావు పెళ్ళిలో చాలా ముచ్చట పడ్డాడు, ఆ పిల్ల మరేమీ చెయ్యనక్కరలేదు, తనతో మాట్లాడనక్కరలేదు, తనకి గంధం పూయనక్కరలేదు, తనవైపు చూడనక్కరలేదు, పూల బంతేనా, అదేనా ఒక్కమారు తనవైపు విసిరితే తాను దేవేంద్ర భోగమనుభవిద్దామని పాపం! ఎంత ఖిన్నుడయేడో ఆముచ్చటకూడా తీరక ఆ అయిదు రోజులూ ఆ అమ్మాయి మొహంలో కళలేదు, నవ్వులేదు, మూర్తీభవించిన శోకదేవతలాగ కూచుంది, ఎలాగయితేయేం పెళ్ళి అయిందనిపించారు

మరి నాలుగు నెల్లకి విఘ్నేశ్వర చవితికి రాజేశ్వరరావుని రమ్మని అత్తవారు ఆహ్వానలేఖ పంపారు అతను కులాసా పడ్డాడు తన స్నేహితుడొకడు సికందరాబాదునుంచి వస్తూంటే రెండు వీసెల మిఠాయి తెప్పించి అత్తవారింటికి పట్టుకువెళ్ళాడు మిఠాయిబుట్ట ఇంట్లోఇచ్చాడు. మిఠాయి ఆ అమ్మాయి తినే ఉంటుందని ఉద్దేశపడ్డాడు. రెండురోజులయేక తన భార్య ఇంట్లో ఉందోలేదో అని అనుమానం కలిగింది ఉంటే జాడేనా కనబడదా! ఇంట్లోలేకపోతే నన్నెందుకు రమ్మంటా రనుకుని సమాధానపడి ఊరుకున్నాడు మరో రోజుండి ఇంటికి ప్రయాణమయాడు

దసరాకిరమ్మని సూర్యారావు దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది చెన్నపట్టణంలో ఉన్న ఒకస్నేహితుణ్ణి ఏపిల్సు, చెర్రీలు, నల్ల ద్రాక్ష, కాబూలు ద్రాక్ష, పచ్చి కిస్‌మిస్, దానిమ్మ మొదలైన పళ్ళూ, కాబేజి, కాలిఫ్లవరు, బెంగుళూరు వంకాయలు, నూల్‌కోలు, పెద్ద పచ్చిమిరపకాయలు, బీట్‌రూట్, బీన్సు మొదలైనకూరలు పంపమని ఉత్తరం రాసి, అవి వచ్చాక, తక్షణమే అత్తవారింటికి పయనమై వచ్చాడు ఆత్తవారింట్లో పదిరోజులు గడిపాడు సీతమ్మ వారు ఇంట్లోనే ఉంటుందని అతని ఊహ రాత్రిళ్లు చీకట్లో కన్ను తెరుచుకు కూచునేవాడు, ఏ పని మీదేనా ఇవతలికి రాదా, చీకట్లోనే అడుగుల చప్పుడు విని ఆనందిద్దామని ఎంతమంది అడుగులో వినబడేవి, ఆ పిల్లవి మాత్రం కావు నాకంట పడేటట్లు చెయ్యవా పరమేశ్వరా అని దేవుణ్ణి ప్రార్థించాడు, దసరా పూర్తి అయింది ఖాళీ మనస్సుతో ఇంటికి వెళ్ళిపోయాడు అతను ఇంటి దగ్గిర తీవ్రంగా ఆలోచించాడు, "ఎందుచేత లలిత నాకు కనబడదు ? నేను అంద విహీనుణ్ణా ? నేను పరాయివాణ్ణా ? నాలో ఏం లోటుంది ?"

పెద్ద పండుగకు పిలుపు వచ్చింది అకాలంగా మల్లెపువ్వులు పుట్టించుకు వచాడు గంజాం వాసననూనె కొన్నాడు ఆమె రాసుకుంటే ఆ వాసనని దూరంనుంచే ఆఘ్రాణించి సంతోషించ వచ్చని అతని అభిప్రాయం. రాజమహేంద్రవరం వచ్చాడు భార్యకి అందచేశాడు అయిదు రోజులున్నాడు సీసా బిరడా విప్పిన జాడేనా లేదు నేనెందుకు బతికున్నానని అతను విచారించి, సిగ్గువిడిచి అత్తగారి నడిగాడు, వాసన నూనెనుగురించి, "అది ఎక్కడ దాచేసిందో ఎవరికీ కనబడలేదు నాయనా!" అంది ఆవిడ కనుకొలకుల నీళ్లు కనబడ నీయలేదు రాజేశ్వరరావు అతను తనఊరికి వెళ్ళిన తర్వాత మామగారికి ఉత్తరం రాశాడు, తాను తన భార్యకి రాసిన ఉత్తరానికి జవాబు ఆమెచేతే రాయించి పంపమని సూర్యారావు పంపిస్తానని జవాబు రాశాడు. రాజేశ్వరరావు కొన్ని వారాలపాటు ఎదురు చూశాడు నిరాశ చేసుకున్నాడు

వేసంగి సెలవులలో నాలుగు రోజులు ఇక్కడ ఉండి పొమ్మని మామగారి దగ్గిరనుంచి ఆహ్వానం వచ్చింది రాజేశ్వరరావు సిద్ధపడ్డాడు రెండో తరగతి రైలు పెట్టెలో కాకినాడనుంచి రాజమహేంద్రవరం వచ్చాడు టిక్కెట్టు భార్యకి అందచేయించాడు చూసే ఉంటుంది చలనంలేదు అతను ఖిన్నుడయాడు ఆమె స్నేహితురాళ్లు తనకంటే ఎంత భాగ్యవంతురో ! ఆమెకి మల్లెపువ్వులు తెచ్చే మనిషిపాటి అదృష్టమేనా తనకి లేకపోయింది కదా ! "దేవుడా నాకంట పడేటట్లు చెయ్యవా? ఒక ఏనుగు మొర్ర విన్నవాడివి నా మొర్ర వినవా" అని అతను మనస్సులో ఏడ్చాడు దేవుడతని మొర వినలేదు నాలుగు రోజులుండి దిగులుతో, భీతితో కాకినాడకు వెళ్ళిపోయాడు

మళ్ళీ దసారాకి రమ్మని పిలుపు వచ్చింది రాజేశ్వరరావు ఈ మారు అంతా మారిపోయాడు "నేను అంద విహీనుణ్ణి కాబోలు, నా అలవాట్లు దానికి నచ్చలేదు కామోసు నా ప్రేమ దేవతకి ఇష్టమైన రీతిగా వర్తిస్తాను" అనుకొని పెద్దాపురం వేస్టు సిల్కు గుడ్డలు కట్టుగుడ్డలుగా చేసివేశాడు తదుపు పంచకూడా సిల్కు గుడ్డే తలకి సుమ్మని వాసన కొట్టే నూనె కుడిచేతికి మండమీదికి జారుతూన్న బంగారపు గొలుసు ఎడం చేతికి రిస్టువాచీ, చొక్కా గుండీలు, చేతిబొత్తాములు బంగారపువి కళ్ళకి మబ్బు రంగు షోకు కళ్ళజోడు నుదుట తిలకం, ఇలాగ తయారయి వచ్చాడు పుట్టెడు ఆశతో వచ్చాడు ఏమి లాభం ? ఎప్పటిలాగే ఉంది కథ మనస్సులో బాధ ఓర్చుకోలేక అత్తగారితో "మీ అమ్మాయి" అని, ఒళ్ళల్లా ముచ్చెమటలు పొయ్యగా మాటరాక మొహం తుడుచుకుని చివరికి ధైర్యంచేసి "మీ అమ్మాయి ఇంట్లో ఉంది కదూ" అన్నాడు "లేకేం, పెరట్లో ఏ చెట్లమీదో తిరుగుతూంది" అంది ఆమె, "ఆ చెట్టునై పుట్టక పోయాను కదా, ఎంత పాపాత్ముణ్ణి" అని అతను తలచి విచారించాడు తిరిగి ఇంటికి వెళిపోయాడు తన పట్టు గుడ్డలు గోరంతేనా

పని చెయ్యలేదు "అయ్యో! ఖర్మమా!" అని దుఃఖ సముద్రంలో మునిగి పోయాడు.

"సంక్రాంతి పండుగ వస్తూంది ఆహ్వానం వస్తుంది ఈ మారు నేనొక్కణ్ణీ వెళ్ళను మాచెల్లెల్ని కూడా తీసుకు వెళతాను కొంత లాభం ఉండవచ్చు" అని రాజేశ్వరరావు తలపోసి తన చెల్లెలి అత్తవారి ఊరు వెళ్ళి, చెల్లెల్ని తీసుకువచ్చాడు రాజమహేంద్రవరం నుంచి ఆహ్వానం వచ్చింది భార్యకి రకరకాల పట్టుగుడ్డలు కొన్నాడు సబ్బులు, వాసన నూనెలు, అత్తరువులు తెప్పించి, రాజమహేంద్రవరానికి చెల్లెలితోకూడా వెళ్ళాడు "అది ఇష్టపడడంలోనే ఉంది నా బతుకంతా అది లేని నాడు నేను బతికినా ఒకటే చచ్చినా ఒకటే" అని అనుకున్నాడు రెండు రోజులున్నాడు భార్య ఉన్న పొడ కనబడలేదు అయినా తన చెల్లెల్ని ఆమెనుగురించి, ఏం పువ్వులు పెట్టుకుంది, ఏం జడవేసుకుంది, ఏమి తింది, ఏమి కట్టుకుంది, నేనంటే ఇష్టమేనా మొదలైన బోలెడన్ని ప్రశ్నలు వేసేవాడు ఆ అమ్మాయి కొన్నిటికి ఏ రెండు మూడు మాటల్లోనో జవాబు చెప్పి, మరి కొన్నిటికి సిగ్గుపడి ఊరుకుని, ఇంకా అడిగితే కోంబడేది రాజేశ్వరరావు సిగ్గువేసి ఊరుకునేవాడు ఇలాగఉండగా ఒకరోజు పొద్దున్న అతను స్నానం చెయ్యడానికని స్నానాల గది దగ్గరికి వస్తుండగా లలిత ఇంట్లోకి వెళుతు ఎళ్ళు సగం తాగి ఒక చిన్న గ్లాసు అక్కడ పెట్టడం కొస్త కనబడింది ఆ గళాసు చూస్తూ అతను మైమరచి పావు గంట సేపు నిలుచున్నాడు ఎవరూ చూడకుండా ఆ గళాసు తువ్వాలు కింద పెట్టి, జాగ్రత్తగా గదిలోకి తెచ్చి పెట్లో దాచుకున్నాడు ఇంట్లో గళాసు పోయిందంటే పోయిందనుకున్నారు రాజేశ్వరరావు ఏమీ మాట్లాడలేదు పండగ పూర్తి అయింది చెల్లెలితోకూడా ఊరికి వెళిపోయాడు చెల్లెల్ని తీసుకు వెళ్లిన ఫలం ఏమీ కనబడలేదు

వేసం కాలం రెండు రోజులు వచ్చి వెళ్ళవలసిందని మామగారు లేఖ రాశాడు. రాజేశ్వరరావుకి ఎప్పటి కంటే పట్టుదల ఎక్కువయింది ఆమెని ఆకర్షించితీరాలి లేక ఆత్మహత్య చేసుకోవాలి అని నిశ్చయించుకున్నాడు పది తులాల గడియారపు గొలుసు చేయించి తీసుకుని అత్తగారింటికి వచ్చాడు. అతను చేయించిన వస్తువుచూసి అందరూ సంతోష పడ్డారు లలిత మెళ్ళో వేసుకుంది. నాలుగు రోజులుచూశాడు, లలిత కనబడుతుందేమో అని జాడ లేదు సిగ్గుమాట మరచిపోయి నోరు తెరిచి అత్తగారిని "గొలుసు వేసుకుందాండి" అన్నాడు, "వేసుకుంది నాయనా!" అంది ఆమె పోయినప్రాణం వెనక్కి వచ్చినట్టు సంతోషించి "గొలుసుతో నాకంట పడలేదండీ!" అన్నాడు ఒంట్లో చచ్చిపోయి, అతనిలో ఉన్న వేదనంతా అతని మాటల్లో పొడ గట్టింది అత్తగారికి "నాయనా! ఇంకెన్నాళ్ళు మరో రెండు నెల్లు ఊరుకుంటే మీ ఇంట్లోనే ఉంటుంది" అంది ఆమె రాజేశ్వరరావుకి మనస్సు మనస్సులో లేదు అతను పలకరించినా పలికే స్థితిలో లేడు తన జీవితాశయం నెరవేరే రోజులు దగ్గర పడ్డాయి కదా అని అమితానందం పొంది ప్రస్తుతం మరిచి దృష్టిభావికాలంలో పడేశాడు మరి నాలుగు రోజులుండి ఊరికి వెళిపోయాడు

మరి మూడు నెల్లకి ఒక పచ్చని కొనల ఉత్తరం వచ్చింది వసంతం నీళ్ళతో రాజేశ్వరరావు పంచ చెల్లెలి పరమైపోయింది రాజేశ్వరరావు తన తపస్సు ఫలించిందని సంతోషించాడు కార్యానికి ముహూర్తం నెల్లాళ్ళలో ఏర్పాటయింది ఈ నెల్లాళ్ళు గడవడమెలాగ? క్షణమొక నెలలాగ ఉంది ముహూర్తం రోజు సమీపించింది బంధు మిత్ర సమేతంగా అతను రాజమహేంద్రవరానికి తర్లి వెళ్ళాడు

తన కుమార్తె అయిన లలితతో తల్లి పొద్దున్న నుంచీ పోట్లాడుతూంది వచ్చిన బంధువులంతా బుద్ధులు చెపుతున్నారా పిల్లకి తండ్రి నాలుగు తన్నబోగా అంతా అడ్డారు, సాయింత్రమయింది లలితని అనేక విధాలుగా శృంగారించారు ఆమె మొహంలో ఏడుపుతప్ప మరొకటి లేదు అంతా సిద్ధమయాక తల్లి లలితని "రా అమ్మా భోజనం చేద్దూగాని" అని పిలిచింది "నేను రాను" అంది లలిత "రా అమ్మా!" అంది తల్లి. శశామిరా

రానంది లలిత రెక్క పట్టుకు తీసుకు వద్దామని తల్లి దగ్గరికి వెళ్ళింది లలిత పరిగెత్తింది "నేను రాలేనను కున్నావా" అంది తల్లి లలిత నూతి గట్టెక్కి కూ చుంది అం ద రూ చూసి దిగ్భ్రమ చెం దా రు "నువ్వు దగ్గరికి వస్తే నూతులో పడిపోతానంది" లలిత తల్లితో తండ్రికి చెప్పలేనంత కోపంవచ్చింది, కర్రపేకు తీసి విసిరాడు తల్లి బతిమాలుకుంది లలితని "కార్యం చెయ్యనంటే వస్తానంది" లలిత, తల్లి ముక్కున వేలేసు కుంది అందరూ బుగ్గలు పొడుచుకున్నారు తల్లి దగ్గరకి రాబోయింది, లలిత రెండుకాళ్ళూ నూతులో వేసింది చావనియ్యమన్నాడు, తండ్రి, "నా తల్లీ నీకు కార్యంలేదు, వల్లకాడూలేదు రాఅమ్మా! నువ్వు బతికుంటేచాలు నాకు తల్లీ ఇంకరా!" అంది తల్లి, "నేను నమ్మను, ఒట్టెయ్యి" అంది లలిత పెంకితనంచేస్తే ఇంక నూతిలో దూకేస్తుం దని తల్లి రామాయణం నెత్తినిపెట్టుకుని కార్యం చెయ్య నని ప్రమాణంచేసింది లలిత నూతిపట్టామించి దిగి వచ్చింది, తల్లి కుమార్తె పునర్జీవి అయినట్టుగా కాగలిం చుకుని ఏడ్చింది, ఈ విశేషాలన్నీ రాజేశ్వరరావుకి తెలి శాయి అతని మొహాన్ని కత్తివేస్తే నెత్తురులేదు అతను దీనంగా "నేను దాన్ని కాళ్ళుపట్టుకు బతిమాలుకుంటే ఒప్పుకుంటుందేమో" అన్నాడు, అందరూ పకాలున నవ్వారు అతని కళ్ళవెంబడి నీళ్లువచ్చాయి అతను కళ్లు తుడుచుకుని గాంభీర్యం తెచ్చుకుని "నేను తిరిగి పెళ్ళిచేసు కుంటా, ఇంక దానితో కాపరంచేస్తే మనిషికి పుట్టలేదు ఇదేనా ప్రతిజ్ఞ" అన్నాడు ఈ విషయం లలితకి తెలియచేసింది తల్లి, "మళ్ళీ పెళ్ళిచేసుకొమ్మను" అంది ఆ పిల్ల నెమ్మదిగా, దిట్టంగా. రాజేశ్వరరావు దుఃఖిస్తూ పరివారంతో తిరిగి కాకినాడ వెళిపోయాడు

అతను కాకినాడ వెళిపోయాక పక్షంరోజులేనా తిరగకుండా రజస్వలయిన పిల్లని పెళ్ళిచేసుకొని, పెళ్లి లోనే శోభనం జరిపి, ఆరోజు మొదలు తనఇంటికి తీసు కొచ్చాడు. ఈ విషయం లలిత ఇంట్లో వినికిడివల్ల తెలి సింది, విచారించి ఊరుకున్నారు.

అయిదేళ్ళయింది, లలిత నవలావణ్యంగా ఉంది. ఆమె నడచినచోట పువ్వులు పూస్తున్నాయి కాటుక కళ్ళ లోని వాలుచూపులు క్రొమ్మెరుగుల్ని ధిక్కరిస్తున్నాయి పలకల లోలాకుల తళుకులు చెక్కులమీద నాట్యాలు చేస్తున్నాయి ఎర్రని చిన్నపెదిమి దొండపండులాగుంది నుదుటిమధ్య కుంకుమబొట్టు పొడుపు సూర్యునిలాగ మెరుస్తూంది తుమ్మెదలాంటి జుట్టు పిరుదులదాకా వేళ్లా డుతూ యువకుల మనస్సుల్ని బంధిస్తూంది

లలిత శృంగారించుకోడం ఒక్కక్షణంలో కాదు. ఆమె వాసననూనెతో జడవేసుకుని తనకి వచ్చిన సబ్బుతో మొహంకడుక్కుని, కళ్ళకి కాటుకరేఖలు తీర్చి, చిగురు వేలితో బొట్టుపెట్టుకుని, తనకి ఇష్టమైన కాఫీరంగు చీర కట్టుకుని, పమిటపిన్ను పెట్టుకుని ముస్తాబయేటప్పటికి గంటసేపు పడుతుంది ఇల్లుగాని, వళ్ళుగాని అతిశుభ్రంగా ఉంటేగాని ఆమెకి కిట్టదు

ఎప్పటిలాగే ఒకరోజున ఆమె ముస్తాబయింది రాత్రి నిద్రపోయే ముందు పట్టెమంచంమీద పడుక్కుని తాంబూలరాగం పెదిమలు అద్దంలో చూచుకుని ఆనం దిస్తూ తన మొహం సొగసుచూసి తనే సిగ్గుపడుతూ, అద్దంతో దోబూచు లాడుతూంది ఆ'గ ఆనందిస్తూన్న ఆమెకి తనలో ఏదో చెప్పలేని వెల్తి కనబడింది తన అందం అసంపూర్ణంగా కనబడింది "ఇల్లంతా అలికి ముగ్గెట్టనట్టుగా వుంది నా సొగసు" అనే ఆలోచన కలి గింది భర్తమీదికి మనస్సుపోయింది ఉపద్రవం సిగ్గు వేసింది కళ్లు మూసుకుంది, తలవని తలంపుగా దృష్టి మళ్లా అతని వేపేపోయింది సిగ్గుపడి పమిట సర్దుకుంది మనస్సులోని తలపును ఆమె తోసివెయ్యలేక పోయింది. ఉట్టినే చేతులువాచింది, తనుకోరిన వస్తువుని అందుకో బోయినట్టు గాసిగ్గుపడి, గభాలునచేతులు వెనక్కిలాక్కుం ది పక్కని తిరిగిచూడగా పట్టపగలు లాంటి దీపం వెలు తురులో గోడని వేళ్ళాడుతూన్న 'శకుంతల ప్రణయ లేఖా రచన' బొమ్మ కనబడింది అమితమైన సిగ్గువే సింది తన్ను తనే కోప్పడింది. ఆమె దృష్టి ఆ పక్కని ఉన్న రాధా విరహం' పటంమీదికి జారింది, చెప్ప

లేనంత సిగ్గువేసి చేతులతో మొహం కప్పుకొంది ప్రియుని బాహువులలో బంధింప బడ్డట్టుగాసిగ్గు పడింది. ఈ ఊహా ప్రణయ చేష్టలకో చెదిరిపోయిన ముంగురుల్ని, కాటుకని, పమిటని సర్దుకుని తియ్యని ఆలోచనల లోనే ఎప్పుడో నిద్రపోయి, తన ప్రియునితో కలిసి ఉన్నట్టు సుఖస్వప్నం పొందింది తెల్లవారిలేచి రాత్రి విషయాల్ని, కలని స్మరించుకుంటూ అడుగడుక్కీ తడబడుతూ సిగ్గుపడుతూ పనులు చేసుకుంది

మనస్సులో కోరిక పట్టరాని దయింది తీగె ఆధారంకోసం వెతికినట్టు ఆమె మనస్సు భర్తకోసం తరుముతూంది ఒకరోజున లలిత తనలో ఇలా తలపోసింది. "నేను నా భర్తదగ్గరికి వెళతాను ఆయన్ని ప్రార్థిస్తాను ఆయన సేవలో నాజన్మ గడిపేస్తాను" అని, అంతట్లో చటుక్కున మరొక విషయం జ్ఞాపకంరాగా తడిరెప్పలు అప్పళించి "మరొకర్తెని వివాహచేసుకున్న ఆయన మాట్లాడతారా? కాళ్ళమీదపడి ప్రార్థిస్తాను, నన్ను తన ఇంట్లో ఉండనియ్యమని కాళ్ళు పట్టుకుంటాను" అని మనస్సులో అనుకుంది అటుతర్వాత ఆమె తన తల్లితో తన ఊహచెప్పింది, తల్లి ఇష్టపడింది

లలిత కాకినాడవెళ్ళి రాజేశ్వరరావు ఇల్లుచేరింది రాజేశ్వరరావుభార్యా ఇంట్లోలేదు. ఆమె పురిటికి పుట్టింటికి వెళ్ళింది రాజేశ్వరరావు తల్లిమాత్రం ఉంది ఆమె లలితనిచూసి కొంతసేపటికి పోల్చుకొని "అమ్మాయీ! వచ్చావా! ఇప్పటికి మామీద కనికరం కలిగిందా! రా అమ్మా? అప్పుడే కాపరానికి వస్తే ఈపాటికి ముగ్గురు పిల్లలతల్లి వౌదువుకదా!" అంది లలిత సిగ్గుపడి తలవంచుకొని "అత్తా! భగవంతుడు నుదుటరాసినది తప్పుతుందా?", అంది నెమ్మదిగా, అత్తగారు "కోడలా! నువ్వుకూడా నా ఇంట్లో ఉండడం నాకు ఆనందమే. వాడు ఏమిటంటాడో ఏమిటో! వాడికి నేనుకూడా నచ్చచెప్తాను అటుతర్వాత నీ అదృష్టం" అంది "భగవంతుడి దయ ఉంటే సరి. ఆయన తలచినట్టే జరుగుతుంది" అంది లలిత వినమ్రతతో. లలిత అందంచూసి అత్తగారు దిగ్భ్రమ చెందిపోయింది దీన్ని నా కొడుకు ఏలుకోవాలని భగవంతుడికి వెయ్యిదండాలు పెట్టింది'

రాజేశ్వరరావుకి లలిత వచ్చినట్టు తెలిసింది అతను తల్లితో "మళ్ళా అది దాపరించిందా? నాకు అక్కర్లేదు. నేను సుఖంగా కాపరం చేస్తూంటే చూశలేదా! బొమ్మను" అన్నాడు తల్లి లలితని వెనకేసుగొచ్చి "అప్పుడేదో చిన్నతనం ఇప్పటికి బుద్ధిమళ్ళింది" అంది నెమ్మదిగా "నాకు బుద్ధి మళ్ళలేదు, నేనేం చెయ్యను, నా కంటపడకుండా వెళిపోవడం నాకు ఇష్టం" అన్నాడు. తల్లి చెప్పలేక చెప్పలేక ఆ ముక్కలు కోడలితోచెప్పింది. లలిత ఖిన్నురాలయింది. కన్నీళ్లు బొటబొట కార్చింది. "నేను బతిమాలుకుంటాను ఆయన్ని" అంది, కన్నీరు చీరచెరగుతో తుడుచుకొంటూ, అత్తగారితోకూడా వెళ్లి ఆమె వెనక సగం కనబడుతూ నిల్చుని రాజేశ్వరరావుతో "నన్ను క్షమించండి. చిన్నప్పుడు తెలియకచేసిన తప్పును క్షమించండి" అంది అందుకు రాజేశ్వరరావు బ్రహ్మాండమైన కోపంతో "నా కాపరం చెడగొడతావా? నన్ను నా భార్యతోటి సుఖంగా ఉండనియ్యవూ? పాలలో చల్ల పోసినట్లు నా కాపరం పాడుచెయ్యవద్దు" అన్నాడు లలిత దీనంగా "నన్ను క్షమించండి" అంది రాజేశ్వరరావు "నన్నే నువ్వు క్షమించు నన్ను బాధించవద్దు. నేను మోటవాణ్ణి" అన్నాడు లలిత కన్నీళ్ళు ఒత్తుకొని తనమెడలో ఉన్న గడియారపు గొలుసు తీసి కింద పడేసింది రాజేశ్వరరావు "నాకు ఏ విధమైన ఇచ్చి పుచ్చుకోడాలు పనికీరావు నీ కిచ్చిన వస్తువు నేను తిరిగి పుచ్చుకోను" అన్నాడు తల్లి తీసి ఆ గొలుసు లలితమెళ్లో వేసి కన్నీళ్ళు కార్చింది, అప్పుడు తాజేశ్వరరావు "నీకు ఇష్టమున్నవాడిని నువ్వు వివాహం చేసుకోవచ్చు నా ప్రతిబంధకమేమీ ఉండదు లా ఒప్పుకోక పోవచ్చు నేను ఒప్పుకుంటున్నా. నువ్వు తిరిగి వివాహం చేసుకోడమే నాకు నువ్వు చెయ్యగల ఆనందమైనపని" అన్నాడు. లలిత కళ్ళని లాక్కుని వెనక్కి మళ్లింది. అత్తగారు చాలా విచారించింది. "ఘటనలేదు మీకు అంతకంటే ఏమిటి చెప్పను బిడ్డా!" అంది లలిత ఆ

సాయంత్రమే తిరిగి రాజమహేంద్రవరం వచ్చేసింది ఆమె వారంరోజులవరకూ తలెత్తుకోలేకపోయింది

సూర్యారావు ఉన్న వీధిలోనే చివరి ఇంట్లో శ్రీధరరావు ఉన్నాడు అతని తండ్రియైన సూర్యనారాయణ గారు వకీలు, శ్రీధరరావు బి. ఏ. పాసయాడు తండ్రి వృత్తిలోకి దిగడం ఇష్టంలేదు ట్రయినింగు అయి ఎక్కడేనా మేష్టరీ ఉద్యోగం చేసుకుందామనుకుంటున్నాడు సూర్యనారాయణగారు తనకుమారుడి వివాహం కోసం ఎంతో తొందరపడుతున్నాడు, గాని శ్రీధరరావు "అప్పుడే చేసుకోను, నన్ను నిర్బంధించకు" అని జవాబు చెబుతున్నాడు

శ్రీధరరావు లలిత తండ్రిని ఎరుగును, కాని పరిచయం తక్కువ అతను ఒకనాటి సాయింత్రం ఆ దారిని పోతున్నాడు లోపలనుంచివచ్చిన లలిత అతన్నిచూసింది సిగ్గుతో చిరునవ్వు రాగా కొంగు మొహానికి అడ్డు పెట్టుకుంది శ్రీధరరావు ఆమెని గమనించాడు చూపు మళ్లించుకోలేక సిగ్గుపడిపోయాడు కొంగుచాటున ఆమె మొహం మేఘం కప్పిన చంద్రబింబంలాగ కనబడింది అతను తనదారిని వెళిపోయాడు మర్నాటి సాయింత్రం శ్రీధరరావు పనిలేకుండానే లలిత ఇంటి గుమ్మం దగ్గరికి వచ్చాడు అతన్ని చూసి లలి ఉత్తేజం పొందిన తన శరీరాన్ని వశంలోకి తెచ్చుకోలేకపోయింది, శ్రీధరరావు "మీ నాన్నగారు ఉన్నారా ?" అన్నాడు కాని జవాబు చెప్పకుండానే లలిత సిగ్గుతో ఇంట్లోకి వెళిపోయింది శ్రీధరరావుకి లలిత ఊహ బోధపడింది "ఈ ప్రేమ మూర్తి వెన్నెల నా మీద ప్రసరిస్తూంది ఇది వెనక నేను నోచిన నోములఫలం'' అనుకుంటూ వెళిపోయాడు

పని ఉన్నప్పుడూ లేనప్పుడుకూడా శ్రీధరరావు లలిత ఇంటికి వచ్చేవాడు "ఈ ప్రేమ దేవాలయంలో నేను ఎప్పుడూ ఉండి పోతేనో ! నాకు ఆహారనిద్రలు అక్కర్లేదు ఆ ప్రేమమూర్తి దర్శనమే నాకు కావలసింది ఆమె సన్నిధిని ఉండడమే నా జన్మ పవిత్రమవడం'' అని తన మనస్సులో తలచేవాడు

శ్రీధరరావు తరుచు లలితదగ్గరికి వచ్చేవాడు, ఆమె అతన్నిచూసి ఆనందించి సంభాషణ విని మైమరిచి, అతని స్పర్శకి ఎదురుచూసేది

లలితా శ్రీధరుల ప్రణయం వారి ఇద్దరి ఇళ్ళలోనూ తెలిసింది సూర్యనారాయణగారు మొదట కొంత కంగారు పడ్డాడు సూర్యారావు ఒకరోజున సూర్యనారాయణగారి దగ్గరికి వెళ్లి "మా అమ్మాయిని లలితని మీ పిల్లవానికి వివాహం చేసుకోవలసింది" అని వినయంగా చెప్పాడు, అందుకు సూర్యనారాయణగారు "తొందరపడి నేను నా అనుమతి ఇయ్యను రాజేశ్వరరావుని అడగందే నేనేమీ చెయ్యను అతను అడ్డురాకుండా ఉంటే నేను ఒప్పుకోగలను" అన్నాడు సూర్యారావు ఆ విషయమై సూర్యనారాయణగారికి నచ్చచెప్పాడు కాని ఆయన ఆలోచిస్తానన్నాడు

సూర్యనారాయణగారు స్వయంగా కాకినాడ వెళ్లి ఆ విషయం నిర్ధారణ చేసుకున్నాడు రాజేశ్వరరావు ఆయనతో "ఆమె వివాహం చేసుకోడమేనా అభిప్రాయం, నా ఆనందం అని తెలియచేశాడు సూర్యనారాయణగారు తిరిగివచ్చి శ్రీధరరావు లలితని వివాహంచేసుకోడానికి అంగీకరించాడు ఒక శుభముహూర్తాన్ని ఏకరాత్రి వివాహం నిర్ణయించారు ఆ పెళ్ళికి రాజేశ్వరరావు భార్యతోను, పిల్లలతోనూ వచ్చాడు అతని తల్లి రాలేదు అతను పెళ్లికూతురికి పలకలగాజులు, పట్టుచీర చదివించాడు లలిత దాంపత్యం చక్కగా ఉన్నందుకు సంతోషించి "ఇది కదా ఆమెకి వివాహం వయస్సు నేను అజ్ఞానిని" అని తడికళ్లు తుడుచుకొని తన పెట్లొంచి చిన్నగళాసు తీసి లలితచేతికి ఇచ్చి "లలితా, ఈ గళాసుకోసమేనా వెనక వెతుక్కున్నారు'' అన్నాడు లలిత ఆశ్చర్యపడింది "ఇది నేను మీ ఇంట్లో దొంగవిల్లి చేశాను, ఇది నీ బదులు ఇన్నాళ్ళు నా దగ్గిర ఉంది ఇది నీకు కాదు నీ భర్తకి ఇస్తున్నాను జాగ్రత్తపెట్టుకొమ్మని'' అని ఆ గళాసు శ్రీధరరావుకి ఇచ్చాడు శ్రీధరరావు దానిని సంతోషంగా అందుకున్నాడు రాజేశ్వరరావు లలితా శ్రీధరుల్ని చిరకాలం సౌఖ్యమనుభవించమనీ, చక్కని సంతానం కన మనీ దీవించి తన కుటుంబంతో తిరిగి కాకినాడ పయనమయి పోయాడు